కేవలం ధనం - పరువు మాత్రమే అయితే ఎలాగన్నా అంగీకరింప చెయ్యొచ్చు కాని జాతి, మతం, సాంప్రదాయం ఏది చూసినా అతకని రజియాని అంగీకరింపమని తనెలా అడగగలడు? అడిగినా అంగీకరించరు! అందరినీ కాదని రజియాని చేపట్ట గలడా? అనవసరంగా మమతలు పెంచుకుంటే తరువాత తెంచుకోలేక బాధ పడాలేమో - రజియాతో పరిచయాని అట్టే దూరం వెళ్ళనీయక పోవడం మంచిదేమో.

ఊహూ- రజియాని మరిచిపోవడం ఎలా? అనుక్షణం కళ్ళ ముందు నిలిచే ఆ సౌందర్యాన్ని కాదనుకోడం సంభవమా? రజియా ముందు వెధవ జాతి, మతాలు, పరువు ప్రతిష్టలు తృణప్రాయం కావా? రజియా కోసం ఆ మాత్రం వదులుకోలేవా.

ప్రతి క్షణం సంశయంతో, సందేహాలు, అనుమానాలు చుట్టు ముట్టు తూండగా ఎటూ తేల్చుకో లేక పోయేవాడిని - అయినా బొత్తిగా పది రోజుల పరిచయంతో యింత దూరం ఆలోచించడమేమిటి అన్పించేది మరో క్షణంలో - రజియా మనసులో అసలు ఏముందో - రజియా మొహం చూస్తూంటే ఆమె కూడా తన పట్ల ఆకర్షితురాలై నట్టే వుంది. ఏం తనకేం లోపం - చదువు అందం, ఆస్తి అంతస్తు ఏదిలేదు. రజియా తనతో మాట్లాడు తూంటే ఆ కళ్ళల్లో వెలుగు, సిగ్గులకి అర్థం ఏమిటి? తను గదిలోకి రాగానే ఆమె కళ్ళు సిగ్గుతో వాలి పోవడం, మాట్లాడుతూంటే తడబాటుకి. వీటన్నింటికి అర్థాలు వేరే చెప్పాలా?

—— నా ఆలోచనల్లో నే నుండగానే రజియా ఆస్పత్రి నించి డిస్చార్జి అయ్యే రోజు రానే వచ్చింది. రజియా వెళ్ళిపోతుందంటే నా పెన్నిధి ఏదో దూరం అయి పోబోతున్నట్టు - నాలో చైతన్యాన్ని ఎవరో లాక్కుపోతున్నట్టు నిస్పృహ నిరాశతో గిలగిల లాడిపోయాను - రజియా-తల్లి యిద్దరూ అనేక విధాల పదే పదే కృతజ్ఞతలు చెప్పారు-రజియా యింకా కొన్నాళ్ళు రెస్టుతీసుకోవాలని-తీసుకోవలసిన జాగ్రత్తలు డాక్టరు చెప్పిందే మరో సారి చెప్పాను. రజియా మళ్ళీ కాలేజికి వెళ్ళే వరకు తల్లికూడా తోడు వుండేట్టు నిర్ణయించాం అందరం కలిసి - రమ - శకుంతల యిద్దరూ హాస్యాలాడ్తూ తల్లి వినకుండా రజియాను ఏడిపిస్తూ వీడ్కోలు తీసు కున్నారు. నాలో ఉత్సాహాన్ని రజియా తనతో తీసికెళ్ళి పోయింది - భారంగా వీడ్కోలు చెప్పాను.

— రజియా వెళ్ళాకగాని రజియా యిల్లు ఎక్కడ వుందో కూడా అడగలేదని గుర్తువచ్చి నా మతి మరుపుని తిట్టుకున్నాను - నాలుగు రోజులు అవకముందే రజియాని చూడకుండా వుండలేక పోయాను. రజియా ఉనికి ఎలా తెల్సుకోవడం - ఎక్కడని వెతకను, ఏం చెయ్యను అనుకుంటు పిచ్చివాడిలా అయ్యాను- చటుక్కున రజియా ఉమెన్సు కాలేజిలో చదువుతూందన్న సంగతి గుర్తు వచ్చింది. ఆ మాట ఇన్నాళ్ళు గుర్తు రానందుకు చింతించాను. వెంటనే మరో ఆలోచన లేకుండా స్కూటరు ఎక్కాను-తీరా కాలేజికి వెళ్ళానేగాని రజియా కొన్నాళ్ళపాటు కాలేజికి రాదన్న నిజం గుర్తు రాలేదు. ఉత్సాహం మీద నీళ్ళు దిమ్మరించినట్లయి నిలబడి పోయాను - అంతలో రమ, శకుంతల పుస్తకాలతో వస్తూ కనిపించేసరికి పోయిన ప్రాణం లేచివచ్చింది - ఆనందంగా 'హలో' అని పలకరించాను. ఇద్దరూ ఒక్కక్షణం తెల్లబోయి "ఓ! రాకుమారుడిగారా! ఇలా దయ చేశారేం - పాపం రాకుమారుడుగారు ఒక్కసంగతి మరచిపోయినట్లున్నారు. మా నెచ్చెలి ఇంకా కొన్నాళ్ళు కాలేజికి రాదుగా" అంది కొంటెగా రమ. వాళ్ళకి దొరికి పోయినందుకు కాస్త సిగ్గనిపించింది. తరువాత బుకాయింపుగా "లేదు, రజియా కోసం కాదు. మీతో చిన్నపని ఉండి వచ్చాను" అన్నాను.

"అబద్ధా లాడకండి. పాపం రజియా ఎడ్రసు కావాలి గదూ! ఇంటి వివరం అడగనందుకు మీరూ, చెప్పనందుకు ఆవిడా యీ వారంరోజులుగా దిగులుపడి పోయారు. ఆఖరికి మేం గుర్తువచ్చి ఇలా వచ్చారు." రమ నవ్వుతూనే కుండబద్దలు కొట్టినట్లు అనేసింది.

వాళ్ళదగ్గర ఇంక దాచి లాభం లేదని నవ్వేశాను. "మీరు ఎలాగయినా చాలా తెలివైనవారు. పదండి ఇంటికి వెడదాం" అన్నాను. వాళ్ళు నవ్వుతూ నడిచారు.

"మీ రజియా డాక్టరు గారి బిల్లు చెల్లించకుండా వచ్చేసినట్లుంది. పేషంటుని వెతుక్కుంటూ డాక్టరే బయలుదేరారు" అంది శకుంతల కొంటెగా.

"అవును. ఫీజు కలక్టు చేసుకోవద్దూ! కాస్త కూస్తనా వదలివేయడానికి-" నేనూ హాస్యంగా అన్నాను. ఏవో హాస్యాలాడుతూ మాట్లాడుకుంటూనే ఇల్లు చేరాం.

ముందుగదిలో మంచంలో పడుకొని ఏదోచదువుకుంటున్న రజియా ననుచూడగానేకలవరపడిపోయింది. ఆ క్షణంలో ఆమె మొహంలో భావం వర్ణించలేను.